# క్రీనీడ

రెండు గదులున్న నా చిన్నకొంపకు చుట్టూతా పొట్టి ప్రహరీగోడా దానికొక పాత ఇనుపగేటూ ప్రత్యేకమైన అలంకారాలు.

ఆ గేటు మీద ఉడుత పరుగు పెట్టినా, కాకివాలినా అతి విచిత్రంగా స్పందిస్తుంది. ఇక మనిషి చెయ్యివేస్తే సరేసరి. ఆ ధ్వని చెవులపడగానే నా గది కిటికీలోంచి తలరిక్కించి ఒకమారు చూడ్డం నాకు యాంత్రిక ధర్మమైపోయింది. అలా అతి సున్నితంగా స్పందించేలా ఆ గేటును ఏ ఇంజనీరూ ప్రత్యేక శ్రద్ధతో మలచలేదు. మా ఆవిడా నేనూ ఇంటలేని సమయాల్లో ఆ గేటును ఆటవస్తువుగా చేసి వీథిలోని కుర్రకారు ఉయ్యాలలూగుతూ వినోదించడం ఒక వేడుక. అలా లుకలుకలాడిపోతూ న్యాయపాలన కోసం జహంగీరుద్వారం దగ్గర ఏర్పాటు చేసిన గంటలాగ ఏ ప్రాణి తాకినా స్పందించడం నేర్చుకుంది. ఇక ఏ ఎలక్ట్రిక్ బెల్లూ వేరే పెట్టించవలసిన అవసరం నాకు కనబడలేదు.

నేనూ మా ఆవిడా ఒక ఉదయం పెట్టేబేడా సర్దుకునే కార్యక్రమంలో నిమగ్నమై ఉన్నాం. ఆ సాయంత్రం పెద్దవాడి దగ్గరకు – ముంబాయి మా ప్రయాణం కనుక . గేటు చప్పుడైంది. కాసింత విసుగ్గానే కిటికీలోంచి చూశాను. గేటు మీద చెయ్యివేసిన పెద్ద మనిషి తనకెదురుగా మూసి ఉన్న కట్టెతలుపునీ, ద్వారాన్నీ నిశితంగా చూస్తున్నాడు. నేను గది కిటికీలోంచి చూస్తున్నాను అనే ధ్యాసలో లేడు. అంచేత నేను ఓరకంట అంచనా వేసే అవకాశం కలిగింది.

ఆ శాల్తీనాకు బొత్తిగా అపరిచితుడు. సన్నగా నీరసంగా జెండాకొయ్యలా పొడుగ్గా ఉన్నాడు. ఇంటినీ, పరిసరాల్నీ, లోపలి మనుష్యుల్నీ వాళ్ల ఆర్థికస్తోమతనీ మూల్యాంకన చేస్తున్నట్లున్నాడు. ఆవేషధారణ విలక్షణంగానే ఉంది. ఎక్కడో విచిత్రవేషధారణపోటీలో పాల్గొని అలా వేదిక దిగి ఇలా వచ్చేసినట్లున్నాడు. లేత కాషాయరంగుది పొడువుచేతుల చొక్కా, దానిమీద నలిగిన పసుపుపచ్చని వైస్టుకోటు, మాసిన తెల్లపంచె మెడలో పైకి కానవచ్చేలా రుద్రాక్షమాల,

నుదుట విభూతిరేఖలు, మధ్యలో కుంకుమబొట్టు, దానికి క్రిందనే గందంబొట్టు- వీటన్నిటితో చూసిన ఆ శాస్త్రీని మరోమారు ఉత్సుకతతోచూడగోరేలా ఉన్నాడు. గచ్చకాయలా నున్నటి ఆ తలమీద మిగిలిపోయిన నల్లని జుల్పాలని పొడుగ్గా పెంచి నెత్తిమీద పరచి జారిపోతున్న యవ్వనాన్ని పొదవి పట్టుకునే ప్రయత్నం చేస్తున్నట్టు అనిపించింది. ముసలివాడు కాడు. జీవితం అంటే ఆశ కళ్లలో మెరుస్తోంది.

నా కొంపంతా కలిపి విశాలమైన రెండుగదులూ, వంట గదీ -దాని వయసు ముప్పయి అయిదేళ్లు దాటబోతోంది. నన్నూ నా ఆలు బిడ్డల్నీ కాపాడి నీడనిచ్చి బాగా అలసిపోయింది. కాస్త పాతపడి గోడ పెచ్చులు అక్కడక్కడ ఊడినా మాకేమీ కష్టం కలిగించలేదు. పిల్లలు రెక్కలొచ్చి దూరంగా ఎగిరిపోయినా అది నన్నూ నాభార్యను ఇంకా భద్రంగానే చూసుకుంటోంది. ప్రత్యేకమైన రంగులూ, హంగులూ నేనేమీ దానికి పులమలేకపోయాను. నేను ఆ ఇంటిని కట్టిన పదేళ్ల తర్వాత నుంచీ ఆ బస్తీలో ఇంచు మించు అధునాతనమైన వాస్తు శిల్పవిన్యాసంతో కంటికింపైన ఇళ్లు ఎన్నో చుట్టూ వెలిశాయి. ఏసూత్రానికైనా ఏదో ఒకటి లొసుగు, మినహాయింపు తప్పదన్నట్టుగా ఆ బస్తీలో మావీథి చివర్న నా ఇల్లూ, వీథి మొదట్లో నాంచారయ్య ఇల్లూ పాతబడి, హంసల్లో కాకుల్లా కనిపిస్తాయి. నాంచారయ్య ఇల్లు పాతది అన్నానేకానీ నాసిరకం ఏ మాత్రం కాదు. నాలుగొందల చదరపు గజాల జాగాలో పెద్దపోర్టికోతోనూ, ఎత్తయిన మేడతోనూ ఒక పాతకాలపు పెద్దమనిషి సిరిబొజ్జని తడుముకుంటూ హుందాగా నిలబడినట్టు ఉంటుంది.

ఉదయాన్నే గేటు మీదచెయ్యివేసిన మనిషిని అలాగే నిలిపేసి మా ఇంటి వర్ణనలోకీ, గతంలోకి ో గి కూరుకుపోతున్నానని ఏమీ అనుకోకండి, క్లుప్తంగా కొంతైనా చెప్పవలసిన అవసరం ఉంది.

నేనూ నాంచారయ్యా ఒక ఆఫీసువాళ్లంకాదు, ఇల్లు కట్టుకుందుకొక జాగాను వెతుక్కుంటూ ఈ ప్రాంతానికి వచ్చాకనే ఒకరి కొకరం పరిచయమయ్యాం. మేం వచ్చేసరికి అన్ని జాగాలూ అమ్ముడుపోయి మూడే మూడు స్థలాలు మిగిలేయి. ఒకటి మైసమ్మగుడికి ఎదురుగ్గా ఉన్నది. మిగిలినవి రెండూ కాసింత దూరాన, అంటే లే అవుట్‌లోని ఒక వీథికి ఆదిలో ఒకటీ, అంతంలో ఇంకొకటీ ఉన్నాయి. గుడికెదురుగా ఉన్న నాలుగొందలగజాల జాగా నాశక్తి కి కాస్త మించి ఉందని మనసులో అనుకుని ఊ. ..లాడుతూ ఉన్నపుడు నాంచారయ్య గట్టిగా మందలించాడు.

" గ్రామదేవత గుడ్లెర్రజేసి చూస్తుంటే, ఎదురుగా ఉన్న స్థలంలో ఇల్లు కడతావా ? పిల్లాపాపలతో ఉన్నవాళ్లం. నేను తీసుకోలేకనే ఊరుకున్నానా ?" అన్నాడు గుండె బాదుకుంటూ. "

సర్వాంతర్యామి చూడని జాగా ఎక్కడుంటుంది ?" అని చిన్నగా అన్నాను.

ఇంతకీ నాలుగొందలు గజాలు కొనేంతశక్తి లేక మూడొందల గజాల జాగా వేపు నాదృష్టిని మళ్ళించాను. కాస్త ఉన్నవాడు కాబట్టి ఐదొందలు గజాలు నాంచారయ్య బేరమాడి రిజిస్టరు చేసుకున్నాడు. అలా పరిచయమైన సమయంలో నాంచారయ్య శాస్త్రం, లౌక్యం ఎరిగినవాడు, ఆర్థికస్తోమత ఉన్నవాడు అని తోచింది. నా అంచనాని నిజం చేస్తూ నిండుగా మేడకట్టాడు. అంచలంచలుగా పోర్టికో, విశాలమైన గేటూ, ప్రక్కనే ఒక చిన్న అవుట్‌హౌజ్ కట్టించాడు. అద్దెరూపంలో కూడా కొంత రాబడిని కళ్ళచూస్తున్నాడు, గేటు స్తంభాలమీద బంగారు అక్షరాలతో లక్ష్మీనివాసం, నాంచారయ్య అని పెద్దగా చెక్కించాడు. సరే, అదంతా గతం. ఇక ప్రస్తుతానికి వస్తే ఆరోజు ఉదయం మా ఇంటివాకిట నిలబడ్డ ఆగంతకుడు తన నిశితపరిశీలన ఆపి గేటు తీసుకుని తలుపుదాకా వచ్చి "ఏమండోయ్ "అని గొంతెత్తి పిలిచాడు. కిటికీలొంచే "ఎవరూ ?" అన్నాను.

అంతవరకూ నేనతన్ని గమనించకుండా గొంతు విని స్పదించినట్టు మొహం పెట్టి ఏమంటాడో అని ఆసక్తిగా ఎదురు చూశాను.

"అద్దెకు ఇల్లు ఉందా అండీ ?"
"ఉందని ఎవరన్నారు ? టులెట్ బోర్డు పెట్టలేదే –"
కాస్త నీళ్లు నమలి "ఇది మైసం బస్తీ కదండీ ?"
"అవును" అన్నాను, చేతివ్రేళ్లమధ్య ఏదో కాగితాన్ని నలుపుతూ ఆలోచిస్తున్నాడు.
సులభంగా నన్నూ నా ఇంటినీ విడిచిపెట్టే ప్రయత్నంలో లేడు.

"నాంచారయ్యగారని ... ఇక్కడ ఉన్నారా ?"అడిగాడు. ఆ ప్రశ్న వినగానే నాకు వాడంటే ఉన్న అభిప్రాయం ఇంకా దిగజారింది. నా చెవిలోనే పువ్వు పెట్టే ప్రయత్నం చేస్తున్నాడనుకున్నాను. కాకపోతే, వీధి మొదట్లోనే కొట్టవచ్చినట్టు ఎత్తుగా కనిపించే మేడనూ, గేటునూ, స్తంభాలమీద చెక్కిన పేరునూ చూడకుండానే వీధి చివరిదాకా వచ్చాడని ఎలా నమ్మడం. ఇదేదో గరుడపక్షి విలోకనం.

ఏమైనా సరే ఇక కిటికీలోంచి ప్రసంగించడం బావుండదని తలుపు తీసి బయటకు వచ్చాను. అదే నేచేసిన పొరపాటు.

చేతికున్న బంగారు వర్ణపు కంకణం సవరించుకుంటూ " ఇవాళ ఎండ బాగానే కాసేటట్టుంది, కాస్త మంచితీర్థం ఇప్పిస్తారా ? "అని అర్థించాడు. నాభార్య తీసుకొచ్చిన చెంబుడు నీళ్లు గటగట త్రాగి త్రేన్చాడు.

"అప్పట్లో బోర్లువేసే యంత్రసదుపాయం, ఎక్కువగా విస్తరించక బావి తవ్వించినట్లున్నారు.

ఇంకాస్త ఈశాన్యదిశగా తప్పించి ఉంటే ఈ ఇల్లు మీద రెండంతస్తులు లేపేవారు కదా !" అన్నాడు.

"ఏదో మా అవసరాలకు తగినంతగా కట్టుకున్నాం" అని నిరాసక్తంగా తన అధిక ప్రసంగానికి అడ్డకట్ట వేశాను.

"నాంచారయ్య గారికి అస్వస్థతగా ఉందిని విన్నాను ...."

"అలాగా ? నాకా విషయం తెలియదు" అన్నాను. ఇదివరకెన్నడూ ఈ వ్యక్తిని నాంచారయ్యగారితో చూసిన జ్ఞాపకం లేదు. బంధువుగా ఊహించడానికీ తగినంత ఆధారం లేదు. అందుకనే నా ఎదుట నిలబడ్డవాణ్ని బాట తెలియని ప్రవరాఖ్యుడిలా కాక నిర్దిష్ట ప్రణాళికతో దండెత్తిన అలెగ్జాండర్‌లా భావించాను.

"వాయవ్యదిశగా బరువు ఉంచడం మంచిది కాదు" అన్నాడు. నా ఇంటి ప్రక్కనే దూరంగా ఉన్న పెద్దుమేపు తన దృష్టి సారించి

"పాతకుర్చీలు, పనికిరాని సామాన్లూ కాలికడ్డంపడకుండా అందులో పారేయడానికి కట్టుకున్న చిన్నపాక, ఆదెంత బరువు ?" అని సమర్థించాను.

"మీకు వాస్తుశాస్త్రమంటే అంతగా గౌరవం ఉన్నట్టు లేదు" అన్నాడు ఊరుకోక, ఆ మాటలో ఏదో కవ్వింపూ, ఏదో ప్రసంగాన్ని పొడిగించే ప్రయత్నమూ ఉంది.

"శాస్త్రాలన్నీ మనమంచికే, ఎటొచ్చి దాని వినియోగంలోనే స్వార్థం, వ్యాపారధోరణీ చోటుచేసుకుంటాయి. మనిషిలోని ఆత్మ విశ్వాసాన్ని దెబ్బతీస్తూ ఉంటాయి" అన్నాను.

" మొన్న విద్యాశాఖమంత్రిగారింట్లో ఇలాటిమాటే వచ్చింది." అంటూ ఇంక విజృంభించ బోతూ ఉంటే వామ్మో ఇక వీణ్ని వదిలించుకోవడమే విజ్ఞత, నాకు బోలెడు పని ఉంది అనుకుని – అసహనంగా లోనికిపోబోయాను. మొహంలో కాసింత నిరుత్సాహం కనిపించినా " శాస్త్రం అంటూ కదిపితే ఇక డొంకంతా కదుల్తుంది. సరే, ఇంకోరోజు కలుసుకుందాం " అని విసురుగా వెళ్ళబోయిన విక్రమార్కుడు రెండడుగులు వేసి వెనక్కువచ్చాడు. " మరోలా అనుకోకండి ఇక్కడ జాగాలు ఏరేటు పలుకుతున్నాయి ..." అని అడిగాడు.

" ఏం చెప్పగలను, నేనైతే ఈ మధ్య ఏ స్థలం కొనలేదు, అమ్మలేదు " అని నా చేతిలోని కాగితాలేవో చూడ్డంలో నిమగ్నమైపోయాను. బారుగా తీసిన గేటు తలుపుకాసింత దగ్గరగానైనా లాగి వెయ్యకుండా వెళ్లిపోయాడు. నేను ఆ గేటును మూసి, కాళీ చెంబును పట్టుకుని ఇంట్లోకి

పోబోతుంటే నాభార్య వార్తగా చెప్పింది. " మొన్న ఏదో పేరంటానికి పోతే నాంచారయ్యగారి భార్య కనిపించింది. పెద్దపిల్లకాపురం సవ్యంగా సాగడంలేదట. రెండోదానికి సంబంధాలు వచ్చినట్టే వచ్చి తప్పిపోతున్నాయట. ఆయనేమో బెంగపెట్టుకుని మంచం పట్టాడట, ఏదో ఆపరేషను కూడా చెయ్యాలని డాక్టర్లంటే చేసుకుందుకి భయపడుతున్నాడట."

మానవుడూ ఒక యంత్రమే. జరామరణాలు, సహజమే అని స్వగతంగా అనుకున్నాను- నా భార్యలో సున్నితమైన అభిప్రాయాలూ, విశ్వాసాలూ ఉండవచ్చు ఉంటే అనవసరంగా ఘర్షణ పెంచడం ఇష్టం లేదు. అయినా ఊరుకోలేక పోయాను. "అవతలవాళ్లకి బండెడు ఆస్తులు ఉంటేనేకానీ పిల్లను ఇవ్వడు – నాంచారయ్య.విపరీతంగా ఆస్తులు పెంచుకున్నవాళ్ల ఆలోచనలు కూడా విపరీతంగానే ఉంటాయి–" అని నా కసి తీర్చుకుని, సాయంత్రం ప్రయాణానికి పెట్టిబేడా సర్దుకోవాలని హెచ్చరించాను.

★★★

అలా ముంబాయ వెళ్లినవాళ్లం సుమారుగా నాలుగు నెలల వరకూ తిరిగి రావడానికి కుదరలేదు. ఏవో ముచ్చటలాడుకుంటూ ఆటోలో స్టేషన్ నుంచి ఇంటికి వస్తున్నాం. మా వీధిలోకి రిక్షా మళ్లుతున్నపుడు ఏదో వెల్తిగా కనిపించింది. నా గుండె ఆగినట్టయింది. ఇక్కడ ఏదో బోసిపోయినట్లుందే – అన్నది నా శ్రీమతి కూడా. వీధి వెడల్పు అంతంతమాత్రమే. దాని నిండా పగిలిన ఇటుకబెడ్డలు, విరిగిన కాంక్రీటు తునకలు పోగులు పడి మా ఆటో అతి నెమ్మదిగా వీధి చివరవరకూ సాగింది. వీధి అంచువరకూ విస్తరించి గంభీరంగా కనపడే నాంచారయ్య మేడ రూపే మారిపోయింది. పోర్టికో లేదు. మెట్లు లేవు.కొన్ని కిటికీలు మూతపడి కొత్తగా లేచిన గోడల్లో భాగమైపోయాయి. తీసేసిన బుగ్గలతో, కరిగిపోయిన పొట్టతో, మాసిన గడ్డంతో వ్యాధిగ్రస్తుడైన మాజీ వస్తాదులా వన్నె తరిగిపోయింది.పాతగోడలు కూలేయి. కొత్తవి లేచాయి. అక్షరాలా – ఇల్లు పీకి పందిరి వేసినట్టుంది. అటు చూస్తే మరో పదిగజాలు దాటేసరికి బూసయ్యగారు కొత్తగా కట్టిన ఇల్లుకూడా ఒక ప్రక్కగునపాలపోటుకి గురౌతోంది. ఇదివరకు అందంగా నిలిపిన కిటికీలు మూసివేస్తున్నారు , ఆపనుల్లో రాజయ్య కూడా ఉన్నాడు. రాజయ్య అంటే మా ఇంటి పనిపాట్లలో సహాయపడే పారమ్మ మగడు.

ఇదేం కర్మ . మనుష్యులకి ఏవో వైరల్ ఫీవర్లు వస్తాయని విన్నా కానీ మా బస్తీలో ఇళ్లకు కూడా అంటువ్యాధి ఏదో సోకలేదుకదా అనుకుంటూ ఉండగా, మా ఇంటివాకిట రిక్షా ఆగింది.

"చానాళ్లయి పోయెగదమ్మా, నువ్వు·లేకుంటె నాకు దిక్కుతోచలేదు –" అంటూ పారమ్మ పలకరించింది.

"నాంచారయ్యగారిల్లూ, ఆ బూసయ్యగారి ఇల్లూ అలా తవ్వి పెట్టారేమిటి పారమ్మా! నీ మగడు కూడా పని చేస్తున్నాడక్కడ" అని అడిగాను.

"ఏం చెప్పాలె దొరా! బక్కాయినొకడొచ్చిండు. కిరాయికి మన బస్తీలోనె చిన్నది తీసుకున్నడు. ఆ పెద్దమనిషి అన్నదే మాట అయిపాయె. జనాలట్టిజేస్తున్రు. కొట్టుడు, కట్టుడు, అట్టజేస్తెనె పానం నిమ్మలంగుంటదట– లేకుంటె..." అని చెప్పుకుపోతోంది, నేను ఇంటి తాళాలు తీశాను. నాభార్య పారమ్మ చెప్పేది శ్రద్ధగా వింటోంది, ఇప్పుడే మైసమ్మగుడిదాకా పోయి ఒకపాల పేకట్ కొనుక్కొస్తానని చెప్పి బయలు దేరాను.

ఒక ప్రక్క ఇంటి పని సాగుతూ ఉంటే, కాసింత దూరంగా అవుట్‌హౌజ్‌కి దగ్గరగా పడక కుర్చీలో నాంచారయ్య పడుకుని ఉన్నాడు. కాలికేదో కట్టు, ఇదివరకు నే చూసినకన్నా చాలా నీరసించి ఉన్నాడు. ఒక్కనిముషం అలా వెళ్లి నిలిచి, అతన్ని – "ఏం నాంచారయ్యగారూ! ఎలా ఉన్నారు?" అని పలకరించాను.

"ఏం చెప్పను, ఆరోగ్యం అంతంత మాత్రమే, నారోజులు బావులేవు. ఖర్చుకి ఖర్చు, శ్రమకి శ్రమా, మనసులో హైరానా, ఇదిగో చూడు, గోడ పడగొడుతూ ఉంటే నిన్న రెండు ఇటుకలు తుళ్లి నాకాలి మీద పడ్డాయి. దానికి కట్టు –" అని వాపోయాడు.

"ఇప్పుడే ఊరినుంచి వచ్చాను, మళ్లా కలుస్తా"నని అక్కడ నుండి ఊడిపడి గుడిదాకా, పోయాను. ఒక పాలపేకట్ అక్కడిషాపులోంచి కొనుక్కుని వస్తున్నాను.

మైసం గుడికెదురుగా చాలాకాలంగా ఖాళీగా పడి ఉన్న స్థలంలో ఏదో సందడి, పునాదులు లేస్తున్నాయి. చేతగొడుగు పట్టుకుని, అక్కడే నిలబడి, జరుగుతున్న పనిని పర్యవేక్షిస్తున్న పెద్దమనిషి ఒంటిమీద చొక్కాలేదు. కావిరంగు సాదాపంచె మాత్రం కట్టుకుని ఉన్నాడు. మొహం చూస్తే ఎక్కడో ఎపుడో చూసినట్టే అనిపించింది. సందేహం లేదు, సరిగ్గా నాలుగు మాసాలకిందట ఒక ఉదయం నా గేటు మీద చెయ్యి వేసిన విచిత్రవేషధారే, అయితే అప్పటి ఎండు రూపు మారిపోయి కొస్త కండపట్టినట్టున్నాడు.

పాలపేకట్ అందుకుంటున్న నా శ్రీమతి సాలోచనగా నావేపుచూస్తూ "ఎందుకేనా మంచిది. మనం కూడా ఆ పనికిరాని షెడ్డును తీసేద్దాం" అంది.

పడరాని క్రీనీడ నా ఇంటి వాకిట కూడా పడినందుకు నిర్ఘాంతపోయాను.

– ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 27 జూలై 1998